## కుంగ్-ఫూతో ఆత్మస్థైర్యం

ధర్మారం,ఏప్రిల్6:కుంగ్–ఫూ సాధనతో ఆత్మస్థైర్యం పెంపొందడంతోపాటు,ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్ –ఫూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టులు ప్రదానోత్సవానికి ఎస్ఐ హాజరయ్యారు. ఈసందర్భంగా 120 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రుప్లా నాయక్,డ్రాగన్ స్వార్డ్ కుంగ్–ఫూ అకాడమీ గ్రాండ్ మాస్టర్ రాజమల్లు,జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్,సీనియర్ మాస్టర్లు,శ్రీనివాస్,హరికృష్ణ, ప్రసాద్, చందు,లింగంపల్లి రమేశ్,వెంకటస్వామి తో పాటు విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సుల్తానాబాద్ రూరల్,ఏప్రిల్ 6: యుతవ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శివాజీ యూత్ క్లబ్ కన్వీనర్ పడాల రవీందర్ గౌడ్ అన్నారు. శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గర్రెపల్లిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రవీందర్ గౌడ్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలు అవినీతి, లంచగొండితనం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఉగ్రవాదం, రాజకీయం, మాదక ద్రవ్యాల వినియోగం తదితర అంశాలపై ప్రభావం విపరీతంగా ఉందన్నారు.

## 'నలిమెల' పుస్తకావిష్కరణ



'నలిమెల' పుస్తకావిష్కరణలో కొలనూర్ పూర్వ విద్యార్థులు

ఓదెల, ఏప్రిల్ 6: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కాళోజీ నారాయణరావు అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ రచించిన పుస్తకావిష్కరణలో ఆదివారం కొలనూర్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. భాస్కర్ ఓదెల మండలంలోని కొలనూర్‌లో స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా తన మొదటి ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఇక్కడ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాలంలోనే 14భాషలు నేర్చుకున్నట్లు పుస్తకావిష్కరణ సభలో పేర్కొన్నారు. దీంతో కొలనూర్ స్కూల్‌లో చదువుకున్న అప్పటి విద్యార్థులు తమ గురు స్వీయ రచనలైన ఏడు పుస్తకాలను ఆదివారం కరీంనగర్‌లోని ఫిలిం భవనంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, కళాకారులతో పాటు కొలనూర్ పూర్వ విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## నేత్రదానం

ఓదెల, ఏప్రిల్ 6: కొమిరె గ్రామానికి చెందిన రాచర్ల మైసయ్య (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడి అతని కళ్లను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. కళ్ల దానం గురించి మృతుడి కుటుంబీకులకు ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి వివరించగా, కళ్లను దానం చేయడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఇందుకు ఆ కుటుంబానికి సదాశయ ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## 11న జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణ



కృష్ణయ్యకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 6: సింగరేణి ఓసీపీ 5లో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఆవిణ ఈ నెల 11న చేపట్టనున్నట్లు సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యను కలిసి విగ్రహావిష్కరణకు ఆహ్వానించారు. ఇక్కడ బీసీ లెసన్ ఆఫీసర్ పెరుమాల్ల శ్రీనివాస్, కైలాసకోటి శ్రీనివాస్(బేబీ), జెల్లా గజేందర్, అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

## 'ఖని'లో అలరించిన ఫ్యాషన్ షో



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామగుండం ఎమ్మెల్యే సతీమణి

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: ఇండియన్ బ్యూటీ అసోసియేషన్ (ఐబీఏ) ఆధ్వర్యంలో గోదావరిఖని మార్కండేయ కాలనీలో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో తొలిసారిగా నిర్వహించిన రామగుండం నియోజక వర్గ స్థాయి ఫ్యాషన్ షో అలరించింది. రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, కన్జ్యూమర్ ఫోరం ప్రతినిధి చేతన సోనీలు ముఖ్యతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మహిళలు ప్రతి రంగంలో తమ ప్రతిభను చాటుతున్న తరుణంలో ఈ ఫ్యాషన్ ప్లాట్‌ఫాంలు మహిళా శక్తిని ప్రదర్శించేందుకు వేదికలుగా మార్చుకోవాలని పలువురు వ్యాఖ్యానించారు. అనంతరం జరిగిన ఫ్యాషన్ షోలో మహిళలు, యువతులు పాల్గొని అలరించారు. న్యాయ నిర్ణేతల చేతుల మీదుగా విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేశారు. ఇందులో ప్రముఖ మోడల్స్, ఫ్యాషన్ డిజైనర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐబీఏ ప్రతినిధులు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ. 24వేలు చెల్లించాలి

జ్యోతినగర్, ఏప్రిల్ 6: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎన్టీపీసీ ఏరియా ట్రాక్టర్ డ్రైవర్లకు ట్రాక్టర్ యాజమానులు కనీస వేతనం నెలకు రూ. 24వేలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూసీ జిల్లా ఉపాధ్యాక్షుడు చిలుక శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీపీసీ రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన ట్రాక్టర్ డ్రైవర్ల అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమానులతో డ్రైవర్లు చేసుకున్న అగ్రిమెంట్ కాలపరిమితి కూడ ఈ నెల 30తో ముగియనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సమావేశంలో వేతనం పెంపు కోసం డిమాండ్ నోటీసును ట్రాక్టర్ యాజమానులకు ఇవ్వాలని తీర్మానించారు. కనీసవేతనం రూ. 24వేలు, ఏడాదికి ఖరీదు చేసే జత యూనిఫామ్, రెయిన్‌కోట్, జత షూ, హెల్మెట్, చట్టపరమైన బోనస్ లీవులు, పది సబ్బులు, పని ప్రదేశాల్లో ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్‌కు పూర్తిస్థాయి వైద్యచికిత్స అందించాలని, ఇతర సమస్యలపై వారు తీర్మాణం చేశారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ నాయకులు గుండు రాజన్న, బీ కొమురన్న, డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఎ మురళి, బీ శ్రీనివాస్, సురేశ్, తిరుపతి, స్వామి, సంజీవ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

# కల్యాణం... కమనీయం

- కనుల పండువగా శ్రీ సీతారాముల పరిణయం
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు..
- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



ధర్మారం : వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



పెద్దపల్లి కమాన్ : కల్యాణోత్సవంలో పాల్గొన్న దాసరి మనోహర్ రెడ్డి దంపతులు



పెద్దపల్లి కమాన్ : పెద్దపల్లిలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



ఓదెల : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కాల్వశ్రీరాంపూర్ : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు




మంథని : కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



జూలపల్లి : పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న రఘువీర్ సింగ్, నాయకులు



కోల్‌సిటీ : కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్



యైటింక్లయిన్ కాలనీ: కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పెద్దపల్లి రూరల్ : తాళి చూపుతున్న అర్చకుడు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, పెద్దపల్లి జిల్లా : జిల్లాలో రాములోరి కల్యాణ వేడుక కనుల పండువగా సాగింది. అభిజిత్ లగ్నంలో రాముడు, జగన్మాత సీతమ్మ మెడలో మాంగళ్యధారణ ఘట్టం అంగరంగ వైభవంగా జరిగింది. అశేష భక్త జనవాహినితో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.మేళ తాళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా వేదికపైకి తీసుకువచ్చారు. దాతలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వామివారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అర్చకులు, పూజారుల మం త్రోచ్ఛరణల మధ్య ఆ దేవదేవుడి కల్యాణ వైభోగాన్ని కనులారా వీక్షించి భక్తులు పులకించారు. ఈ కల్యాణ కమనీయ వేడుకను కనులారా వీక్షించి తన్మయత్వం పొందారు. ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సినీ దర్శకుడు సంపత్ నంది మల్లన్న ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ధర్మారంలోని రామాలయంలో ఆలయ చైర్మన్ పూస్కూరు పద్మజ –జితేందర్‌రావు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించగా విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్,రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వేర్వేరుగా హాజరు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ తరపున వారిని సన్మానించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ దంపతులు గోదావరిఖనిలోని కోదండ రామాలయంలో స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. పెద్దపల్లిలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం లో ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి–పుష్పలత దంపతులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి–ప్రశాంత్‌రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. ఎన్టీపీసీలోని టౌన్‌షిప్‌లో జరిగిన కల్యాణోత్సవంలో రామగుండం సీపీ పాల్గొన్నారు. గోదావరిఖని గౌతమినగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో వాసవ్య విద్యార్థులు ప్రదర్శించిన రామాయణం నృత్యరూపకం అలరించింది. మంథని మండలంలోని పలు ఆలయాల్లో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొన్నారు. పెద్దపల్లి నియోజక వర్గంలోని పలు చోట్ల నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే విజయరమణా రావు హాజరయ్యారు.



పుట్ట నారాయణ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వక్తలు

## పుట్ట నారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలి

గోదావరిఖని/కోల్‌సిటీ, ఏప్రిల్ 6: 1978లో పోలీసు కాల్పులో మృతిచెందిన రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన సింగరేణి గని కార్మికుడు పుట్ట నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఆదుకోవాలని వక్తలు పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక స్నేహ సాహితి గ్రంథాలయంలో పుట్ట నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన పుట్టనారాయణ 47వ వర్ధంతి సభలో పలువురు వక్తలు మాట్లాడారు. నాడు హైదరాబాద్‌లో రమ్మీజాబి దంపతులను ఆదుపులోకి తీసుకోని ఆమెను బలత్కారం చేసి, అతడిని హత్య చేయడంతో చెలరేగిన నిరసన రాష్ట్ర వ్యాప్త బంద్ ఆందోళన నేపథ్యంలో స్థానిక 6ఇంక్లైన్‌లో కోల్ ఫిల్లర్‌గా పనిచేస్తున్న పుట్ట నారాయణ విధులు ముగించుకోని తిరిగి వస్తున్న క్రమంలో గోదావరిఖని న్యూఅశోక్ టాకీస్, సింగరేణి సూపర్‌బజార్ ఏరియాలో జరుగుతున్న నిరసన ఆందోళనలో పుట్ట నారాయణ పోలీసు కాల్పులో మృతిచెందినట్లు తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఇప్పటి వరకు బాధిత కుటుంబానికి ఉపాధి కల్పించలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, సింగరేణి స్పందించి తగు న్యాయం చేయాలని వారు కోరారు. కనీసం కుటుంబ సభ్యులు సొంతంగా విగ్రహం ఏర్పాటుకు కూడ పోలీసులు అడ్డుపడుతున్నట్లు మృతుడి సోదరుడు రాజన్న తెలిపారు. ఇక్కడ రిటైర్డు ఎస్ఐ ఎరుకల పోశం, కందుల రవి, లక్ష్మీనారాయణ, ఉదయ్, హరీశ్, తిరుపతి, నర్సింగరావు, చారి ఉన్నారు.



టోర్నమెంట్‌లో గెలుపొందిన రిలే సీ జట్టు

## క్రికెట్ విజేత 1ఇంక్లైన్ రిలే సీ జట్టు

గోదావరిఖని, ఏప్రిల్ 6: సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో చెపట్టిన సింగరేణి ఆర్జీ–1 ఏరియా జీడీకే 1 ఇంక్లైన్ ఉద్యోగుల ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా రిలే సీ జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 1 ఇంక్లైన్ ఉద్యోగుల రిలే ఏ, రిలే సీ జట్లు పోటీలో తలపడ్డాయి. రిలే సీ జట్టు గెలుపొందినట్లు టోర్నమెంట్ నిర్వాహకులు సిర్ర మల్లికార్జున్, వినయ్‌కుమార్, రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. విజేత జట్టుకు ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ ట్రోఫీని అందజేశారు. ఇక్కడ ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ–1 బ్రాంచీ కార్యదర్శి ఆరెపల్లి పోశం, వైస్ ప్రెసిడెంట్‌లు సంకె అశోక్, మాదన మహేశ్, పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, నాయకులు గుర్రం ప్రభుదాస్ ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుట్ట మధు

## బాధిత కుటుంబానికి పరామర్శ

మంథని, ఏప్రిల్ 6: పట్టణంలోని చాకలి ఐలమ్మ చౌక్ ఏరియాకు చెందిన పుల్లె మల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పుట్ట మధూకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

## నేడు కంటి వైద్య శిబిరం

రామగిరి, ఏప్రిల్ 6: లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ, రేకుర్తి కంటి దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ వనం రాంచందర్ రావు సహకారంతో సోమవారం లద్నాపూర్ జీపీ భవనంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గంట వెంకట రమణారెడ్డి, డా.శరణ్య మారుతి యాదవ్ తెలిపారు. కంటి సమస్యతో బాధపడేవారు ఈ శిబిరంలో ఉచిత వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

## ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మంథని రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని నగరంపల్లి గ్రామా నికి చెందిన దుర్కి కొమురయ్య(45)అనే వ్యక్తి శనివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతుండడంతో పాటు కుటంబ సమస్యలతో సతమవుతు న్నాడు. ఈ నేపథ్యంలో అతిగా మద్యం తాగుతుండడంతో కుటుం బంలో కలహాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శనివారం భార్యతో గొడవ పడగా ఆమె ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో మనస్థాపం చెందిన కొమురయ్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 10 గంటల తరువాత భార్య ఇంటికి వచ్చి చూడగా ఆయన మృతి చెంది ఉన్నాడు. మృతుడి అన్న దుర్కి రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కారు ఢీ కొని ఒకరి మృతి

మంథని రూరల్, ఏప్రిల్ 6: కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మంథని మండలం భట్టుపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంథనిలోని పోచమ్మవాడకు చెందిన గడి రవి(48)అనే వ్యక్తి పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పట్టణంలోని పద్మశాలీ వీధికి చెందిన మాసినేని శేఖర్‌తో కలిసి బైక్‌పై వెంకటాపూర్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా మంథని నుంచి కాటారం వెళ్తున్న కారు భట్టుపల్లి సమీపంలోని గండి మైసమ్మ దగ్గర బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవి కుడికాలు పూర్తిగా విరిగి పోయింది. శేఖర్ కుడి చేతికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. మంథని పోలీసులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి రవి మృతి చెందినట్లు నిర్ధారించారు. వేగంగా కారు నడిపి తన భర్త చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మృతుడి భార్య రజిత ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

**నివాళులర్పించిన పుట్ట మధూకర్..**

కారు ఢీ కొన్న ప్రమాదంలో మృతి చెందిన గడి రవి పార్థీవ దేహానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదివారం సాయంత్రం నివాళులర్పించారు. మంథని పట్టణంలోని పోచమ్మవాడలో ఆయన మృతదేహానికి నివాళులర్పించడంతో పాటు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతో పాటు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

## అలరించిన ఫేర్‌వెల్ డే

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 6: గోదావరిఖని ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ పాఠశాలలో ఆదివారం జరిగిన ఫేర్‌వెల్‌డే లో విద్యార్థులు సందడి చేశారు. పదో తరగతి పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ కరస్పాడెంట్ పేరం రేణుకాదేవి, డైరెక్టర్స్ పేరం హేమలత, శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## సాయి ప్రగతి పాఠశాలలో అభినందన్ వేడుకలు

రామగిరి, ఏప్రిల్6: బేగంపేట సాయి ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం రాత్రి అభినందన్–2025 వేడుకలు అలరించాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మారుమూల గ్రామంలో కార్పొరేట్ తరహా విద్యను అందిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యాన్ని పలువురు అభినందించారు. పాఠశాల వ్యవస్థాపకుడు ముత్తే చంద్రమౌళిని విద్యా విశిష్ట రత్న పేరుతో అతిథులతో పాటు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పని చేస్తున్న నవీన అనే ఉపాధ్యాయురాలు భర్త నరేశ్ చనిపోగా, ఆమెకు ఉపాధ్యాయులు, యాజమాన్యం కలిసి రూ.40వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ట్రస్మా సెక్రటరీ అరుకాల రాంచంద్రారెడ్డి, ఎంఈవో కొమురయ్య, పాఠశాల వ్యవస్థాపకుడు చంద్రమౌళి, ట్రస్మా నాయకులు అంజారెడ్డి, సమ్మారావు, శ్రీనివాసరెడ్డి, ఐలి మధు, కృష్ణవేణి వికాస్ పాఠశాల అధినేత రవికుమార్, హెచ్‌ఎం బర్ల శ్రీనివాస్, డైరెక్టర్ రంజిత్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రామాయణ సన్నివేశంలో విద్యార్థులు

## అలరించిన రామాయణ నృత్యరూపకం

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 6: గౌతమినగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన రాములోరి కల్యాణంలో గోదావరిఖని వాసవ్య విద్యార్థులు రామాయణం నృత్యరూపకం ప్రదర్శించారు. ఈ నృత్య రూపకం ఆహూతులను అలరింపచేసింది. చిన్నారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
★మా కంపెనీలో పనిచేయుటకు స్త్రీ, పురుషులు 6 గురు కావలెను. వయస్సు: 30 సం||లోపు వారు. ఉచిత వసతి. ఎలాంటి చదువు అవసరం లేదు. జీతం: 12,000/- నుండి 15,000/- వరకు సెల్: 9849316058.
NTW-000
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189